# "అభిమానవతి సాకలోల్ల లింగవ్వ"

సాగవారిన తుమ్మసెట్టోలె నల్లటిరంగు, మొకంమీన మచ్చలు, గొగ్గిపండ్లు, వంగిన్నడుము. లోపలికిపెయిన సిన్నకండ్లు, ఎన్నుకంటుకపెయిన కడుపు గిది సాకలోల్ల లింగవ్వాకారం. ఐదు కిలోమీటర్ల దూరంలున్న ఎలుకలపెల్లూర్నంచచ్చి రోజు ఎస్సీవిల బట్టలుతుకుతది లింగమ్మ. దినం తప్పిచ్చి దినమత్తది. ఇంట్లనే ఉతికి ఆరేసి పోతది. గిట్లో పదిండ్లుతుక్కుంట బతుకుతది. సానేండ్లవట్టి మా ఇంట్ల గూడ లింగమ్మే బట్టలుతుకుతంది.

అరవయ్యేడేండ్లున్న లింగమ్మ గంతదూరంకెల్లొచ్చి బట్టలుతికి పోతుందంటె నాకాశ్చెర్యమనిపిత్తది. బట్టలెక్కో అయినయని, లింగమ్మ తెల్లంగుతుకుత లెవ్వని మా ఆవిడ అప్పుడప్పుడు సిన్న సిన్నగ కొట్లాటోలె పెట్టుకుంటె నేనిద్దరి నడుమ కొట్లాట లేకుంట సముదాయించుత. అప్పుడప్పుడు నేనామెను మాట్లాడిత్త. ఓపారోపారి లింగమ్మే తన కట్టసుఖాలన్ని సెప్పుకుంటది. కొడుకులు కోడండ్లు, మనుమలు, మనుమరాండ్ర గురించి గరువంగ సంబురపడుకుంట సెప్పుకుంటది. బూమి, జాగలున్నోల్లు, దనంగిట్టున్నోల్లు కొడుకు లరుసుకుంటలేరని సెప్పుకుంటంటె లింగమ్మ నోట్లెకెల్లి ఒక్కనాడన్న ఆల్లమీద పిరాదు మాటిన్లే. నేనోపారి పగటిలి ఇంటికచ్చెవారకు బట్టలుతికెండేసి మా ఆమె గిన్నెలన్నం బెడితె తింటంది.

"మంచిగున్నవా లింగమ్మ?" అనడిగిన.

"మంచిగనే ఉన్న సారు" అంది తినుకుంటనే.

"బిడ్డలెంత మంది నీకు"

"ఇద్దరు సారు"

"మంచిగ బతుకుతరా?"

"గట్లనే ఆల్లకాల్లు మా బతుకుతరు"

"మీ ముసలయినున్నడా?" అనడిగిన

"మా ఉన్నడు గని సాతగాకుంటయింది సారు. నడుం పురాగొంగిపెయింది"

"ఏం జేసెటోడు మంచిగున్నప్పుడు" బట్టలు మార్చుకుంటన్న.

"కులకస్పి జేసెటోడు. ఊళ్ళె పదిండ్లుండె. గవ్వి ఉతుక్కుంట పయినాల్జేసెటోడు. దొరల సవారుబండ్ల ముంగటురికెటోడు. లగ్గాల పల్లకిలు మోసెటోడు. సాతనయినప్పుడు అరొక్క పని జేసెటోడు. సవారెడ్లకందకుండ ఉరికెటోడు. గట్ల సేసిసేసే మూలకువడ్డడు.

ఎంత జేసినా పటేండ్లు, దొరల తిట్లయితె తప్పపోవు" అంది చేయి కడుక్కుంట లింగమ్మ.

"ఇప్పుడిగ నువ్వు పెడితెనే తినన్నా?" అన్న నేను.

"ఐదారేండ్లవట్టి పురాగ సాతగాకుంటయింది. నేనే అరుసుకుంటున్న" అంది వాష్‌బేసిన్ల గిన్నె కడుక్కుంట. గిన్నె టేబుల్‌మీన పెట్టి

"ఇగ వోతన్న సారు" అనుకుంటెల్లిపెయింది.

గీ వయసులామెందుకు పనిజెయ్యన్నో తెలుసుకోవన్నని మల్లోసారి ఆమెనడిగిన.

"ఏంది ముసలవ్వ. నీకు కొడుకుల్లేరా?"

"ఇద్దరున్నరు సారు. ఒగడేమొ గోదారవరిఖన్ల బాయిపన్జేత్తండు. ఇంకొగడేమో ఊల్లనే ఎవుసం జేసుకుంట బతుకుతండు" అంది

"ఇద్దరెదిగిన కొడుకులుండంగ నువ్వు గంతదూరంకెల్లచ్చి పన్జెయ్యన్నా? ఆల్లు ముసలోల్ల నరుసుకోరా?" అన్న నేను.

"ఎందు కరుసుకోరు సారు. మా అరుసుకుంటరు. ఆల్లకు బారమవుడెందుకని ముసలయినె నేను వేరే ఉంటన్నం. ఆల్ల బతుకులాల్లను బతుకనిత్తయిపాయె. సాతనయినన్ని దినాలు గిట్లనే సేసుకుంట" అంది లింగమ్మ.

"మంచిదానివే ముసలవ్వ! ఇద్దరు సంపాయిచ్చె కొడుకులుండంగ నువ్వు గింత కట్టం జేసుకుంట బతుకన్నా సెప్పు? మీ ఇద్దరు ముసలోల్లకు బుక్కెడంత బువ్వ పెట్టరా కొడుకులు' ' అన్న నేను.

లింగమ్మదోతీరుగ నవ్వింది.

"ఆల్లు బువ్వపెత్తలేరని గీ పన్జేత్తన్ననా సారు! నా కాల్లు రెక్కలు సల్లగున్నయి. అటిటు నడువత్తంది, పన్జెయ్యసాతనైతంది. మా ఇద్దరికి తిండికయ్యేటట్టు సంపాయిత్తన్న. గిట్ల సాతగాంగ గూడ అట్టిగుండి ఆల్లమీనదారపడెందుకు బతుకాలె సెప్పు? గీ రెక్కలల్ల సత్తువుండంగ గా గుంజిగాల్లను బువ్వెయ్యి మనడుగన్నా? వట్టిగ్గాసుండాల్లు వెడితె తినన్నా? మల్ల ఆల్లమీనదారపడి బతుకుతె కోడలు పొల్లగాండ్లకింత మీదికి పోతది. ఆల్ల ముంగటెందుకు నంగి నంగుండాలె సెప్పు' ' అంది లింగమ్మ.

"అంటే ససంత్రంగంనే బతుకుతనంటవు?"

"మీకు తెలువందేముంది సారు? నేను పన్జేసెపటికె సేతులిన్ని పైసలుండె. గవ్వీటితోని ముసలయ్య, నేందినంగ మా కొడుకుల పొల్లగండ్లు దగ్గెరికత్తె అదోటిదోటి కొనిత్తి. బిడ్డలింటికత్తె అరుసుకుంటి. ముసలయినెకు రొండు బింకుల కల్లు దాగుడలువాటుండె. గదానికి కొడుకుల్నియ్యమంటె మా ఇత్తరు గవి కోడలు పోరగాండ్లూకుంటరా? గులుగరా? ఇంటికల్లుండ్లత్తె కల్లు కూర దెప్పిత్తి. నేను పన్జెయ్యకుంటె పైసలు సేతులుంటయా? గిసొంటి అక్కరెట్ల తీరుతయి? ఒక్కొక్క పైసగ్గాడ

సెయ్యి జాపడుగాలె. గదిజ్ఞతనిపియ్యదా సెప్పు? గందుకనే సాతనయినన్ని దినాలు గీ కాల్రెక్కలాడినన్ని రోజులు గిట్లనే పన్జేసుకుంటనే బతుకుత. పురాగ సాతగాకుంటయి కుక్కిలపడితె గప్పుడు సూసేది. గప్పుడాల్లే అరుసుకుంటరు. అరుసుకోకుంటె నలుగురు మొకం మీదుంచరా?' ' అంది లింగమ్మ.

"నువ్వన్నది సాన మంచిగుంది గని నీ కొడుకుల్నిన్ను పన్జెయ్యద్దనరా మరి?"

"ఎందుకనరు సారు? మా అంటరు. మా పెద్దోడోసారి 'అవ్వా! గిప్పున్నీకు గీ పనేందే? తమ్ముడు నేను నెలకు సెరిన్ని బియ్యం, సామాన్లిత్తం. మంచిగ్గాసుండి తినుండ్రి" అన్నడు. కని నేనే "ఎందుకు తియ్యి బిడ్డ. కాల్లురెక్కలాడినన్ని దినాలు మీ మీదెందుకాదారపడుడన్న" అంది లింగమ్మ.

ఆనాడు పన్జేసి ఎల్లిపోయింది.

మల్లోనాడు సంబురపడుకుంటచ్చి నాతోనంది "నా కొడుకంటండు సారు 'నువ్వ బొగ్గుబాయి పన్జేసుకుంట ముసలోల్లతోని పన్జేపిత్తన్నావుర, అని నా సోపతికాల్లు తిడ్తండ్రే అవ్వ. నువ్వ గీ పనిజెయ్యకు' మంచిగ కాలుమీద కాలేసుకొనుండు' అన్నడు. కని నేనిన్లే.

"మంచి పని జేసినవవ్వ. నీ తీరు గందరుంటె ఈ దేశంలకెల్లి సోమరితనమే ఎగిరిపోయేది' అని నవ్విన.

బట్టలుతికారేసి పోవుకుంట "ఎల్లుండి రానమ్మ నేను" అంది నా పెండ్లాంతోని.

"ఏంది లింగమ్మెందుకు రావు?" అంది నా పెండ్లాం.

"నా సిన్నబిడ్డ పసిద్దయింది.[60] కొడుకు పుట్టిండు. ఎల్లుండి పురుడు" అంది.

నేను బయటకచ్చి 'నువ్వేం బెడుతన్నవు' అన్న.

"బిడ్డకు బట్టరెక సేత్తన్న. అల్లునికో దోతి, అంగి కొంటున్న. మనుమనికో అంగి, కుల వెడుతున్న. ఎడపాల్లకో అంగి వెడుతన్న. సాలయా సారు" అంది.

"గంత కంటెక్కే ఎవ్వలు పెడుతరు గని. నీ కొడుకులేం బెట్టరా?"

"అల్లిట్టం పెడితె వెడుతరు. లేకుంటె లేదు. నేం జేసేటియయితె జెయ్యాలె గద? లేకుంటె నలుగుట్ల నల్లమొకం గాదా? అల్లు పెడుతనన్నా గని పెండ్లాలు పెట్టనిత్తరో లేదో? అయినా గని అంతో ఇంతో మాపెడ్తరు' అనుకుంటెల్లిపెయింది.

అభిమానవతి లింగవ్వంజూత్తె నాకెంతో గర్వమనిపిత్తది. గీ వయిసులగూడ రెక్కల కట్టంతోని సనంత్రంగ బతుకుతున్న లింగవ్వ యాదికచ్చినప్పుడల్ల పరాన్నభుక్కులోలె బతికెటోల్లంజూత్తె అసయ్యమనిపిత్తది. బొర్రలు పెంచెటోల్లని జూత్తె సిగ్గనిపిస్తది.

★ ★ ★